సాక్షి పెద్దపల్లి

శుక్రవారం ; 27 ; సెప్టెంబర్ ; 2024



ప్రైవేట్ ఓబీ సంస్థతో జీఎం సమీక్ష

గోదావరిఖని: స్థానికులనే ఉద్యోగాల్లోకి తీసుకోవాలని కోరుతూ జీడీకే-5 ఓసీపీలో పనులు నిలిచిపోవడంతో ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ గురువారం ప్రైవేట్ ఓబీ పీసీ పటేల్ కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపారు.



నవరాత్రోత్సవాలకు ఏర్పాట్లు

వేములవాడ: రాజన్న సన్నిధిలో అక్టోబర్ 3 నుంచి 12 వరకు పది రోజుల పాటు నిర్వహించే దేవీ నవరాత్రోత్సవాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

గరిష్టం/కనిష్టం
32.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

ఫీజు పైసలిస్తలేరు..!

- రెండేళ్లుగా అందని ఫీజు రీయింబర్స్‌మెంట్
- తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్న యాజమాన్యాలు
- స్కాలర్‌షిప్, మెస్‌చార్జీల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

జిల్లా సమాచారం

విద్యార్థులు	30,280
కళాశాలలు	65
ఫీజు రీయింబర్స్‌మెంట్ (రూ.కోట్లలో)	2.44
మెస్ చార్జీలు(రూ.కోట్లలో)	2.57



ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని పోస్టుకార్డులు పంపుతున్న విద్యార్థులు(ఫైల్)

సాక్షి, పెద్దపల్లి: పేద పిల్లలు ఉన్నత చదువు చదువుకునేలా అప్పటి వైఎస్‌ఆర్ ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ పథకం అమలులోకి తీసుకొచ్చింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రభుత్వమే ఫీజు చెల్లిస్తూ వచ్చింది. అయితే, రెండేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్‌లు అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోర్సులను బట్టి ఏటా రూ.3 వేల నుంచి రూ.5వేల వరకు ఉపకారవేతనాలు, మెస్‌చార్జీలు రూ.5 వేల నుంచి రూ.16వేల వరకు ప్రభుత్వం చెల్లిస్తోంది. రూ.40వేల నుంచి రూ.1.20లక్షల వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విద్యార్థుల పేరిట కాలుజీ యాజమాన్యాల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమచేస్తోంది. నిబంధనల ప్రకారం విద్యాసంవత్సరం ప్రారంభంలోనే అర్హులైన విద్యార్థులకు ఈ మొత్తం చెల్లించాల్సి ఉన్నా.. సర్కారు ఇంకా ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు ఫీజు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

65 కాలేజీల్లో..

జిల్లాలో జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్, బీఈడీ, డీఈడీ, నర్సింగ్, బీ ఫార్మసీ, ఎంఫార్మసీ తదితర కోర్సులు అందిస్తున్న కాలేజీలు 65 ఉన్నాయి. అందులో 30,280 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం విద్యాసంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అర్హులైన వారికి ప్రభుత్వం 25శాతం రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి. ఏడాది మధ్యలో 50శాతం, చివరలో మరో 25శాతం చెల్లించాలి. కానీ, విద్యార్థుల దరఖాస్తులను అధికారులు ఈ-కుబేర్‌లో అప్‌లోడ్ చేసినా చాలామంది విద్యార్థులు, యాజమాన్యాల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమకావడం లేదు. ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడమే ఇందుకు కారణమని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఫీజురీకింబర్స్‌మెంట్ కోసం విద్యార్థులు ఇబ్బందులుపడుతుండగా.. కాలేజీల్లోని బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాలు అందడంలేదు. ఫీజు చెల్లించాలని యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకొస్తున్నాయి. సర్టిఫికెట్ల కోసం వెళ్తున్నవారి నుంచి ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నాయి. బకాయిలు చెల్లించాలని కోరుతూ విద్యార్థులు ఇటీవల సీఎంకు పోస్టుకార్డులు రాసి నిరసన వ్యక్తం చేశారు. ఇదే విషయమై ఎస్సీ, బీసీ, మైనార్టీ అధికారులను వివరణ కోరగా, దరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా ఈ -కుబేర్‌లో నమోదు చేశామన్నారు. నిధుల కేటాయింపులకు అనుగుణంగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తున్నామని తెలిపారు.

పైసా రాలేదు



నాకు ఫస్టియర్ నుంచి ఇప్పటి వరకు ఫీజురీయింబర్స్‌మెంట్ రాలేదు. మా అమ్మానాన్న కాలేజీ ఫీజు కడుతున్నరు. ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేయాలి.

–పి.శ్రావ్య, బీఎస్సీ(ఎంపీసీ- థర్డ్ ఇయర్)

రెండేళ్లుగా లేవు



రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, మెస్ చార్జీలు ఇవ్వకుండా విద్యార్థుల భవిష్యత్‌లను సర్కారు ఇరకాటంలో పెడుతోంది. ఫీజు కట్టకపోతే కాలేజీలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.

– బి.ప్రణయ్‌కుమార్, బీకాం(థర్డ్‌ఇయర్)

సర్కారు బడుల్లో మెరుగైన విద్యనందించాలి



ముత్తారం పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఆ దిశగా ఉపాధ్యాయులు చొరవ చూపాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. పెద్దపల్లి మండలం హన్మంతునిపేట, ముత్తారం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపర్చి విద్యార్థులు నాణ్యమైన విద్యనభ్యసించేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు. పాఠశాలలో కంప్యూటర్ విద్యను బోధించాలని, రిపేరింగ్ అవసరమున్న కంప్యూటర్లను తొలగించాలన్నారు. మధ్యాహ్న భోజన నాణ్యతలో లోపాలుంటే చర్యలు తప్పవన్నారు. అంగన్‌వాడీ కేంద్ర భవనం పరిశీలించిన కలెక్టర్ మరో భవనంలోకి తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారుల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. హెచ్ఎం దశరథం, నాగరాజు తదితరులున్నారు.

కరాటే విజేతలకు అభినందన

కరాటే కుంగ్‌ఫూ, తైక్వాండ్ పోటీల్లో జిల్లా విద్యార్థులు నైపుణ్యమైన ప్రదర్శన చూపి 20 బంగారు, నాలుగు వెండి పతకాలను సాధించడం అభినందనీయమని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం జాతీయ చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. కరాటే మాస్టర్లు సుమన్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ కుంభకోణంపై విచారణ జరిపించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: సీఎంపీఎఫ్ కుంభకోణంపై విచారణ జరిపించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆర్జీ-2 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డీజీఎం(పర్సనల్)కు వినతిపత్రం అందజేశారు. సింగరేణి సంస్థ తమ వాస్తవ లాభాల్లో 33శాతం వాటా చెల్లించాలని అన్నారు. బొగ్గుగని కార్మికుల సమస్యల పరిష్కారానికి బీఎంఎస్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. కార్మికునికి 250గజాల భూమి అప్పగించి రూ.50లక్షలు వడ్డీలేని రుణం అందజేసి సొంతింటి కల నిజం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సారంగపాణి, నాయకులు మాదాసి రవీందర్, వడ్డేపల్లి కుమారస్వామి, ప్రమోద్, అరుకాల ప్రసాద్, రమేష్, కర్రావుల మహేశ్, యాదగిరి నరేశ్, శివాజీ, నర్సయ్య, మల్లికార్జున్, శంకర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి హేమంత్‌కుమార్

పెద్దపల్లిరూరల్: జిల్లా కోర్టు ఆవరణలో ఈనెల 28న నిర్వహిస్తున్న జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి స్వప్నరాణితో కలిసి మాట్లాడారు. కక్షిదారులు తమ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. పోలీసు, బీమా కంపెనీ న్యాయవాదులు తమవంతుగా సహకారం అందించి లోక్ అదాలత్‌లో కేసుల రాజీకి సహకారం అందించాలని తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో దాదాపు 1,400 కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కరించామన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ పాల్గొన్నారు.

విద్యతో పాటు ఉపాధి శిక్షణ నేర్చుకోవాలి



కుట్టుమిషన్ అందిస్తున్న ఎమ్మెల్యే

సుల్తానాబాద్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు ఉపాధి శిక్షణ నేర్చుకోవాలని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. గురువారం సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించిన బ్యూటీషియన్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు కుట్టుమిషన్లు, బ్యూటీషియన్ సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఉమెన్స్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, స్టేట్ మేనేజర్ విజయశ్రీ, డిస్ట్రిక్ట్ మేనేజర్ జయశ్రీ, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కవిత, స్పెషల్ ఆఫీసర్ స్వప్న, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సభ్యులు

పెద్దపల్లిరూరల్: మహిళా చట్టాలపై మహిళలు కనీస అవగాహన కలిగి ఉండాలని మహిళా సాధికారిత జెండర్ స్పెషలిస్టు స్వప్న, ఫైనాన్స్ లిటరసీ సంధ్యారాణి అన్నారు. రాఘవాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పోక్సో చట్టం, లింగనిర్ధారణ నిషేధచట్టం, బాల్యవివాహ నిషేధచట్టం, లింగ వివక్ష, రుతుక్రమం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. హెచ్ఎం హన్మంతు పాల్గొన్నారు.

అటవీ అధికారుల స్వచ్ఛతా హీ సేవా



మొక్కలు నాటుతున్న అటవీ అధికారులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం దేవునిపల్లి గ్రామంలో గురువారం అటవీ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ నాగయ్య, ఎఫ్ఎస్‌వో మంగీలాల్ తదితరులు మొక్కలు నాటారు. స్వచ్ఛత, పరిశుభ్రత పాటించడంతో పాటు వాతావరణ సమతుల్యాన్ని కాపాడే మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అన్నారు. కూనారం ఎఫ్ఎస్‌వో వాయుకుమార్, బీట్ ఆఫీసర్ రామ్మూర్తి, వరప్రసాద్ పాల్గొన్నారు.

బీఎఫ్ఎస్ఐ కోర్సుకు ఎంపిక

మంథని: బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) స్కిల్ ప్రోగ్రాం కోర్సుకు మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా తెలిపారు. రాష్ట్రంలోని డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు ఉద్యోగాలు పొందేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ కోర్సును 20 డిగ్రీ కళాశాలలు, 18 ఇంజినీరింగ్ కళాశాలల్లో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులు ప్రారంభించగా మంథని కళాశాల నుంచి ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కృష్ణలు హాజరయ్యారు.

దేశ భవిష్యత్తు కోసం పనిచేయాలి

- ఇంటర్ నోడల్ అధికారిణి కల్పన



మాట్లాడుతున్న ఇంటర్ నోడల్ అధికారిణి కల్పన

పెద్దపల్లిరూరల్: యువత దేశ భవిష్యత్తు కోసం పనిచేయాలని ఇంటర్ నోడల్ అధికారిణి కల్పన అన్నారు. పెద్దపల్లి శివారు బందంపల్లిలో గురువారం ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు భారత త్రివిధ దళాల్లో కీలకమైన ఇండియన్ ఫోర్స్ 'అగ్నివీర్ వాయు' నియామకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. దేశ రక్షణ రంగంలో ముందుకు వచ్చి పలు దేశాల్లో యువత పనిచేస్తున్నారని తెలిపారు. మన దేశం కోసం పనిచేసేందుకు ముందుకొచ్చి ఇలాంటి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వాయుసేన రంగంలో ఉద్యోగావకాశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్లు సందీప్, జైనా ఎయిర్‌ఫోర్స్, నౌకా దళాల్లో చేరేందుకు గల అవకాశాలను వివరించారు. ఇంటర్‌లో సైన్స్, నాన్ సైన్స్ సబ్జెక్టుల వారు 50శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ మైత్రేయి, రాంచంద్రారెడ్డి, రవీందర్‌రెడ్డితో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

స్థానికులకు 80శాతం ఉద్యోగాలు కల్పించాలి



ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎం ఉదయ్ రాజహంసకు వినతిపత్రం ఇస్తున్న మేయర్ అనిల్ కుమార్

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఎరువుల కర్మాగారంలో స్థానికేతరులను తొలగించి స్థానికులకు 80 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని గురువా రం రామగుండం నగరపాలక సంస్థ మేయర్ బి.అనిల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బొంతల రాజేశ్ ఆధ్వర్యంలో ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎం హోఆండ్ ఎం ఉదయ్ రాజహంసకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బొంతల రాజేశ్ మాట్లాడుతూ రామగుండం ఎరువుల కర్మాగారంతో పునర్ ప్రారంభించిన సమయంలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన యాజమాన్యం స్థానికేతరులకు ఉద్యోగ అవకాశాలను కల్పించి స్థానిక నిరుద్యోగ యువతను మోసం చేసిందని అన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులు, ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారం నుంచి వెలుబడుతున్న కాలుష్యంతో ప్రభావిత ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహంకాళి స్వామి, పెద్దెల్లి ప్రకాశ్, మారెల్లి రాజిరెడ్డి పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం



ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ



నివాళి అర్పిస్తున్న సీపీ ఎం.శ్రీనివాస్, అధికారులు

పెద్దపల్లిరూరల్: తెలంగాణ సాయుధ పోరాటంలో వీరవనిత చాకలి ఐలమ్మ చూపిన పోరాటపటిమ మహిళా శక్తికి స్ఫూర్తిదాయకమని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో గురువారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఏవో శ్రీనివాస్, బీసీ వెల్ఫేర్ అధికారి అనిల్‌కుమార్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు.

మహిళా చైతన్యానికి ప్రతీక చాకలి ఐలమ్మ

గోదావరిఖని: మహిళా చైతన్యానికి, ఆత్మగౌరవానికి ప్రతీక చాకలి ఐలమ్మ అని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. గురువారం రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆవరణలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పెత్తందార్ల దురాగతాలను మొక్కవోని ధైర్యంతో ఎదిరించిన తీరు అందరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, సురేంద్ర, సీఐలు రవీందర్, అజయ్ బాబు, ఆర్ఐ దామోదర్, మల్లేశం, శ్రీనివాస్, వామనమూర్తి, సంపత్, సీపీఓ సిబ్బంది, వివిధ వింగ్స్ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎట్టకేలకు బల్దియాలో సీసీ రోడ్ల నిర్మాణాలు

సాక్షి ఎఫెక్ట్



దుర్గానగర్‌లో మొదలైన సీసీ రోడ్డు నిర్మాణ పనులు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్లలో ఎట్టకేలకు సీసీ రోడ్ల నిర్మాణ పనులు మొదలయ్యాయి. 'సాక్షి'లో ఇటీవల ప్రచురితమైన 'రహదారులు శిథిలం .. చర్చిస్తారా? చప్పట్లు కొడతారా?' అనే వరుస కథనాలకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ స్పందించారు. డివిజన్లలో నిలిచిన అంతర్గత రహదారుల నిర్మాణాలను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో దుర్గానగర్‌తో పాటు పలు డివిజన్లలో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు.

త్వరలో నాలుగు మహిళా క్యాంటీన్లు

సుల్తానాబాద్: జిల్లాలో త్వరలో నాలుగు మహిళా క్యాంటీన్లు ప్రారంభిస్తామని డీఆర్‌డీవో ఏపీడీ రవి కుమార్ అన్నారు. సుల్తానాబాద్ ఎంపీడీవో ఆవరణలో ఏర్పాటు చేయనున్న మహిళా క్యాంటీన్‌ను గురువారం సందర్శించారు. ప్రజల సౌకర్యార్థం నాణ్యమైన భోజనం అందించేందుకు జిల్లాలో ధర్మారం, సుల్తానాబాద్, మంథని, పెద్దపల్లిలలో మహిళా క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఏపీఎంలు శ్రీనివాస్, గీత తదితరులున్నారు.

దివ్యక్షేత్రానికి దిక్కెవరు..









శ్రీరంగనాయక స్వామి 108 దివ్యక్షేత్రాల్లో ఒక్కటైన పెద్దపల్లి మండలం ధర్మాబాద్ (ముత్తారం)లోని రంగనాథ స్వామి ఆలయం శిథిలమవుతోంది. శాలివాహనులు ప్రతిష్టించిన ప్రాచీన ఆలయం ఆదరణ లేక ఆనవాళ్లు కోల్పోతోంది. పరమాత్మ రూపం శేషపానుపుపై పడుకొని నిత్యపూజలందుకునే శ్రీరంగనాథుని రూపం గర్భగుడిలో గుప్తనిధుల తవ్వకాలకు గురవుతోంది. ఎంతో ప్రాశస్త్యమైన పుణ్యక్షేత్రం దిక్కులేకుండా కనుమరుగవుతోందంటూ సంబంధిత అధికారులు కాస్త దృష్టిసారించి బాగు చేస్తే భక్తులకు దర్శనభాగ్యం కలుగుతుందంటున్నారు.

– 'సాక్షి' ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

క్లుప్తంగా

కారు కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: కారు కొనివ్వలేదని మనస్తాపానికి గురైన కరీంనగర్ జిల్లా గంగాధర మండలం రాగెల్ల గ్రామానికి చెందిన బేతపు వంశీ (20) ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన బేతపు రాజలింగయ్య కుమారుడు వంశీ. తనకు కారు కొనివ్వాలని కొద్దిరోజులుగా కోరుతున్నాడు. తల్లిదండ్రులు నిరాకరించడంతో ఈనెల 23న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. రెండురోజులైనా ఆచూకీ లేకపోవడంతో కుటుంబసభ్యులు గంగాధర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. వారు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గురువారం జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ శివారులోని శ్రీవేంకటేశ్వరస్వామి గుట్ట వద్ద చెట్టుకు ఓ వ్యక్తి మృతదేహం వేలాడుతూ కనిపించగా.. గొర్రెల కాపరులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్సై సదాకర్ అక్కడకు చేరుకుని విచారణ చేపట్టి వంశీగా గుర్తించారు. రాజలింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సదాకర్ తెలిపారు.

గోదావరిలో మునిగి భక్తురాలి మృతి


భూలక్ష్మి మృతదేహం

ధర్మపురి: గోదావరిలో పుణ్యస్నానాలకు వచ్చిన ఓ భక్తురాలు స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందిన ఘటన ధర్మపురిలో చోటుచేసుకుంది. ఎస్సై మహేశ్ కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన కదారి భూలక్ష్మి (67) పుణ్యస్నానాల కోసం గురువారం వచ్చింది. గోదావరిలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయింది. మహాలక్ష్మి ఘాట్ వద్ద ఆమె శవమై కనిపించింది. జాలర్ల సాయంతో శవాన్ని బయటకు తీయించారు. మృతురాలి అల్లుడు మ్యాక బీరయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోదావరినదిలో వ్యక్తి గల్లంతు


బాలరాజు (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరి నది సమ్మక్క గద్దెల సమీపంలో స్నానాల వాటిక వద్ద సుదర్శి బాలరాజు (29) గురువారం గల్లంతయ్యాడు. గోదావరిఖని టూ టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. గోదావరిఖని చంద్రబాబునాయుడు కాలనీలో నివాసం ఉండే బాలరాజు స్నేహితులతో కలిసి గోదావరి నదిలో స్నానాల వాటిక వద్దకు రాగా ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో పడ్డాడు. రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. అతని స్వస్థలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశ జిల్లా కాగా గోదావరిఖనిలో తాపీమేస్త్రీ పని చేసుస్తున్నాడు. బాలరాజు స్నేహితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

సిమెంట్ లారీ బోల్తా

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని కుస్తాపూర్ శివారులో గురువారం సిమెంట్ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లా నంద్యాల నుంచి లారీ సిమెంట్ లోడ్‌తో మల్లాపూర్ మండల కేంద్రానికి వస్తోంది. కుస్తాపూర్ శివారులో రోడ్డుపై మొక్కజొన్నలు ఆరబెట్టారు. అతివేగంగా వస్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

‘స్వాహా’కార సంఘం!

- సహకార సంఘాల నిధుల పక్కదారి
- జగిత్యాల జిల్లాలో రూ.7.36 కోట్ల గోల్‌మాల్
- ఆరుగురు సింగిల్ విండో సీఈవోలపై వేటు
- పాలకవర్గాలకు షోకాజ్ నోటీసులు
- నిష్పక్ష విచారణకు మంత్రి ‘తుమ్మల’ ఆదేశాలు



సాక్షిప్రతినిధి, కరీంనగర్: జగిత్యాల జిల్లాలోని సహకారం సంఘాల్లో కుంభకోణం ఆలస్యంగా వెలుగు చూసింది. జిల్లాలోని ఆరు సహకార సంఘాలతోపాటు రెండు డీసీఎంఎస్ శాఖల్లో రూ.7.36 కోట్లు గోల్‌మాల్ అయినట్లు సమాచారం. ఇందుకు ఆరుగురు సీఈవోలను బాధ్యులుగా గుర్తించిన ప్రభుత్వం వారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే అవకతవకల్లో బాధ్యులైన సహకార సంఘాల పాలకవర్గాలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మల్లాపూర్ మండలంలోని సిరిపూర్ వంటి ఒక్కటి రెండు సంఘాల సీఈవోలపై కూడా వేటు పడనున్నట్లు సమాచారం. కుంభకోణం విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సీరియస్ అయ్యారని సమాచారం. ఆయన సూచనల మేరకే అధికారులు బాధ్యులపై చర్యలు తీసుకున్నారు. మొత్తం వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరపాలని కూడా మంత్రి తుమ్మల ఆదేశించడంతో ఈ విషయం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.

ఆరు సంఘాల్లో అవకతవకలు..

జిల్లాలోని ధర్మపురి, జైనా, తిమ్మాపూర్, గొల్లపల్లి, నంచర్ల, పెగడపల్లి సహకార సంఘాలతోపాటు డీసీఎంఎస్ ధర్మపురి బ్రాంచ్, డీసీఎంఎస్ గొల్లపల్లి బ్రాంచ్‌లో భారీగా అవకతవకలు జరిగినట్లు తెలిసింది. ఈ మేరకు ప్రభుత్వానికి అందిన నివేదిక ప్రకారం.. పెగడపల్లి సహకార సంఘంలో రూ.1,81,45,068, నంచర్ల సహకార సంఘంలో రూ.96,12,148, తిమ్మాపూర్ సహకార సంఘంలో రూ.67,18,387, జైనా సహకార సంఘంలో రూ.1,55,98,449, ధర్మపురి సహకార సంఘంలో రూ.1,62,19,187, గొల్లపల్లి సహకార సంఘంలో రూ.53,58,809 అవకతకవలు జరిగినట్లు తెలిసింది. అలాగే డీసీఎంఎస్ ధర్మపురి బ్రాంచ్‌లో రూ.6,46,377, డీసీఎంఎస్ గొల్లపల్లి బ్రాంచ్‌లో రూ.13,07,456 అవకతవకలు జరిగినట్లు సమాచారం.

ఆరు సంఘాల కార్యదర్శుల సస్పెన్షన్

ఆయా సంఘాల్లో జరిగిన అవకతవకలకు బాధ్యులను చేస్తూ ఆరు సంఘాల సీఈవోలు జి.ప్రభాకర్ (తిమ్మాపూర్), అయ్యోరి రాజేశ్ (ధర్మపురి), బి.రాంసుధాకర్ రావు(గొల్లపల్లి), టి.గోపాల్ రెడ్డి(పెగడపల్లి), బి.సాగర్ రావు(జైనా), ఆర్.మధుకర్(నంచర్ల)ను సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు జిల్లా సహకార అధికారి సిహెచ్.మనోజ్ కుమార్ ఆయా సంఘాలను సందర్శించి సీఈవోలకు సస్పెన్షన్ ఉత్తర్వులు అందించారు. దీంతోపాటు ఆయా పాలకవర్గాలకు సైతం వారం రోజులు సమాధానం ఇవ్వాలని షోకాజ్ నోటీసులు అందించారు. అలాగే ఆయా సంఘాల్లో జరిగిన పరిణామాలపై సర్వసభ్య సమావేశం నిర్వహించి తీర్మానాలు చేయాలని ఆదేశించారు. దీంతో ధర్మపురి, గొల్లపల్లి డీసీఎంఎస్‌లో జరిగిన అవకతవకలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని పాలకవర్గానికి సిఫారసు చేశారు.

నిధులతో అడ్డగోలు ఖర్చు..

అధికారుల అనుమతి లేకుండా పాలకవర్గాలు తీర్మానాలు చేస్తూ.. కోట్లాది రూపాయలతో సంఘ భవనాలు నిర్మించడం, గోదాములు నిర్మించడం, ధాన్యం కొనుగోలులో పరికరాలను మార్కెటింగ్ శాఖ అనుమతి లేకుండా కొనుగోలు చేయడం, ఇష్టారాజ్యంగా పెట్రోల్‌బంక్‌లు ఏర్పాటు చేయడం, భూములు కొనుగోలు చేయడం, సంఘం భవనాలను రిమోడలింగ్ చేయడం వంటి పనుల్లో అవినీతికి పాల్పడ్డారని ప్రభుత్వం గుర్తించినట్లు సమాచారం. థర్డ్ పార్టీ సర్వే లేకుండా ఇష్టారాజ్యంగా సంఘాల నిధులు ఖర్చు చేశారని ఆరోపణలూ గుప్పుమంటున్నాయి.

అసలేం జరిగింది?

రాష్ట్ర సహకార కమిషనర్‌కు జిల్లాలో పలు సంఘాల్లో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదు అందింది. ఓ ముఖ్య నాయకుడు ఈ వ్యవహారంపై సీరియస్ అవడంతోనే ఈ ఫిర్యాదు ప్రభుత్వానికి చేరింది. దీంతో కమిషనర్ ఈనెల 9 ఫిర్యాదును స్వీకరించి, ఆయా సంఘాలపై విచారణ జరిపేందుకు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్, సీనియర్ ఇన్స్‌పెక్టర్‌తో కూడిన 8 బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందాలు ఈనెల 10 నుంచి 22 వరకు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఈనెల 23న సహకార కమిషనర్‌కు నివేదిక అందించాయి.

సస్పెన్షన్ వాస్తవమే



జిల్లాలోని ఆరుగురు సీఈవోలను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం వాస్తవమే. పాలకవర్గాలకు సైతం నోటీసులు జారీ చేయాలని సూచించింది. జిల్లాలో మరో రెండు, మూడు సంఘాలు అవకతవకలకు పాల్పడినట్లు తెలిసింది. వాటిపై కూడా త్వరలో చర్యలు ఉంటాయి.

– మనోజ్‌కుమార్, జిల్లా సహకార అధికారి, జగిత్యాల

కోరుట్ల ఎస్సై తీరే వేరు

- విచారణ పేరుతో చేయిచేసుకున్న వైనం
- ఎక్కడ విధులు నిర్వహించినా వివాదాస్పదమే..


ఎస్సై శ్వేత

జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లా కోరుట్ల ఎస్సై-2గా పని చేస్తున్న శ్వేత మరో వివాదంలో చిక్కుకున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తిని అకారణంగా చితకబాదడంతో ఆయన అవమానంతో ప్రాణాలు తీసుకున్న తీరు ఆమె దురుసు ప్రవర్తనను మరోసారి బయటపెట్టింది. చేతిలో అధికారం, లాఠీ ఉన్నాయనో.. లేక పోలీసును.. నాకేమవుతుందన్న ధీమానో తెలియదు గానీ.. ఎక్కడ విధులు నిర్వహించినా జనాలను వేధించే అధికారిగా ముద్ర వేసుకోవడం మానడం లేదు. తాజా ఘటనలో ఓ అమాయకుడు ఎస్సై శ్వేత కారణంగా ప్రాణాలు తీసుకోవడంతో జిల్లా ప్రజలు పోలీసు శాఖపై మండిపడుతున్నారు.

కౌన్సెలింగ్‌కు బదులు లాఠీ ఝులిపించి?

మృతుడి కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. జగిత్యాల పట్టణంలోని మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన బొల్లారపు శివప్రసాద్‌పై ఆయన భార్య కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఆమె భర్తను విచారణ పేరిట ఎస్సై శ్వేత ఠాణాకు పిలిపించారు. భార్య ముందే లాఠీ ఝులిపించి, దూషిస్తూ అవమానించారు. ఈ నెల 23న ఉదయం ఇంట్లోనే శివప్రసాద్ పెట్రోల్ పోసుకొని, నిప్పంటించుకున్నాడు. కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి చనిపోయాడు. దీంతో ఎస్సై శ్వేతపై మృతుడి కుటుంబసభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అకారణంగా తమ వాడిని పొట్టన పెట్టుకున్న ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

గతంలోనూ ఇదే తీరు..

జిల్లాలోని పెగడపల్లి ఠాణాలో ఎస్సైగా పని చేస్తున్న సమయంలోనూ శ్వేత అదే మండలానికి ఓ ప్రజాప్రతినిధిని అప్పటి మంత్రి సమావేశంలో ఉన్నప్పటికీ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి, చితకబాదారు. దీంతో మంత్రి ఆగ్రహించి, ఆమెను బదిలీ చేయించారు. ఎస్సై శ్వేత జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న సమయంలో దరఖాస్తుదారులతోపాటు పోలీస్‌స్టేషన్‌కు వచ్చినవారితో దురుసుగా ప్రవర్తించినట్లు ఆరోపణలున్నాయి. మందలించాల్సిన పోలీస్ ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఆమె చెలరేగిపోతున్నట్లు తెలిసింది.

దొంగల ఆచూకీ ఎక్కడ ?

- రెండ్రోజుల క్రితం ఓ వ్యక్తి ఇంట్లో చోరీ
- అంతకుముందు వీణవంక వైన్స్, హార్డ్‌వేర్ షాపులో..
- పోలీసులకు సవాల్‌గా మారిన వరుస దొంగతనాలు

వీణవంక: వీణవంక మండలకేంద్రంలో దొంగలు రెచ్చిపోతున్నారు. ఇటీవల జరిగిన వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈనెల 22 న రాత్రి మండలకేంద్రంలోని నల్లపోచమ్మ వైన్స్‌లో రూ.32వేల నగదు, రూ.85వేల మద్యం, సీసీ కెమెరా డీవీఆర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. పక్కనే ఉన్న ఐరన్, హార్డ్‌వేర్ దుకాణాల్లోనూ డీవీఆర్‌తో పాటు కొంతనగదు ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. రెండ్రోజుల క్రితం వీణవంకలో చందర్ అనే వ్యక్తి ఇంట్లో తాళం పగులకొట్టి రూ.10వేల నగదు ఎత్తుకెళ్లారు. నాలు గు రోజులైనా దొంగలను పట్టుకోకపోవడంతో పలువురి నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సీసీ ఫుటేజీ లేకుండా...

ఈ రెండు షాపుల్లోనూ దొంగతనానికి పాల్పడిన అనంతరం సీసీ కెమెరాలను దుండగులు రాడ్లతో పగులగొట్టారు. అంతేకాకుండా కెమెరాల రికార్డును పొందుపరిచే డీవీఆర్‌ను సైతం ఎత్తుకెళ్లారు. డీవీఆర్‌ల కోసం దొంగలు వచ్చారా.. లేక డబ్బుల కోసమే దొంగతనానికి పాల్పడ్డారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కో డీవీఆర్ విలువ రూ.15వేల నుంచి రూ.20వేల వరకు ఉండటంతో పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. మద్యం దుకాణంలో తక్కువ ధరగల బాటిళ్లను ఎత్తుకెళ్లడంతో స్థానికుల పనేనని ప్రచారం జరుగుతోంది. మద్యంషాపుకు కూతవేటు దూరంలో తాగిన మద్యం బాటిళ్లు లభించినట్లు తెలిసింది. అయితే నాలుగు రోజులైనా పోలీసులు దొంగల ఆచూకీ కనిపెట్టకపోవడంలో అంతర్యమేంటని పలువురు చర్చించుకుంటున్నారు. అలాగే బేతిగల్‌లో ఏడాదికింద ఆరు దొంగతనాలు జరిగినా ఇప్పటివరకు ఒక్క కేసు కూడా చేధించలేకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు విచారణ జరిపి చోరీలకు పాల్పడిన దొంగలను పట్టుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బాలుర ఓవరాల్ చాంపియన్ కరీంనగర్

- ఉత్తమ క్రీడాకారులుగా కిరణ్, యశ్వంతిక
- ముగిసిన రాష్ట్రస్థాయి 68వ ఎస్‌జీఎఫ్ జూడో పోటీలు


క్రీడాకారులతో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ, జూడో సంఘం బాధ్యులు, పీడీ, పీఈటీలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ పోచమ్మమైదాన్‌లోని కెమిస్ట్ భవన్‌లో రెండురోజుల పాటు నిర్వహించిన 68వ పాఠశాల క్రీడల సమాఖ్య రాష్ట్రస్థాయి అండర్ –14 బాలబాలికల జూడో పోటీలు గురువారం ముగిశాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో బాలుర విభాగంలో ఓవరాల్ చాంపియన్‌గా కరీంనగర్ జట్టు నిలిచింది. రెండో స్థానంలో వరంగల్ క్రీడాకారులు నిలిచారు. 25 కేజీల బరువులోపు విభాగంలో నల్లగొండ జిల్లాకు చెందిన కె. కిరణ్‌కుమార్ ఉత్తమ క్రీడాకారుడిగా పతకం అందుకున్నాడు. బాలికల విభాగంలో 40 కేజీల బరువులోపు కేటగిరీలో ప్రతిభ కనబరిచిన కరీంనగర్‌కు చెందిన బి. యశ్వంతిక ఉత్తమ క్రీడాకారిణిగా నిలిచింది.

200 మంది క్రీడాకారులు హాజరు..

23, 27, 32, 36, 40, 44 కేజీల బరువు లోపు కేటగిరీతో పాటు 44కేజీల పైన బరువు కేటగిరీల్లో నిర్వహించిన పోటీలకు ఉమ్మడి పది జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరైనట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దస్రూనాయక్ తెలిపారు. ఏడు కేటగిరీల్లో జరిగిన పోటీల్లో బంగారు పతకం సాధించిన ఏడుగురు బాలికలు, ఏడుగురు బాలురను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. వచ్చే నెల (అక్టోబర్) 3 నుంచి 6వ తేదీ వరకు గుజరాత్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూడో ఫెడరేషన్ బాధ్యులు కైలాస్‌యాదవ్, సంతోష్, రాజు, కిషన్ పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

జీడీకే-11గనిలో కూలిన పైకప్పు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-1 పరిధిలోని జీడీకే-11గనిలో గురువారం గని పై కప్పు కూలింది. గనిలోని 1వ సీమ్ కంటిన్యూస్ మైనర్-2ఏలో రిమోట్ ద్వారా కోల్‌కటింగ్ చేస్తుండగా అకస్మాత్తుగా మూడు మీటర్ల మందంతో సుమారు 5 మీటర్ల వెడల్పుతో పైకప్పు కూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. బొగ్గుపొరల్లో చిక్కుకున్న యంత్రాన్ని బయటకు తీసేందుకు అధికారులు దగ్గరుండి పనులు పర్యవేక్షిస్తున్నారు.

నేషనల్ యూనిక్ అవార్డుకు ఎంపిక


శంకర్

వీణవంక: కళాకారులకు ఏటా ఇచ్చే నేషనల్ యూనిక్ అవార్డుకు మండలంలోని ముగ్గురు కళాకారులు ఎంపికయ్యారు. శ్రీ స్వరవాణి కల్చరల్ ఆర్ట్ అకాడమీ సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న తిరుపతిలో అందించే అవార్డుకు మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కవి, గాయకులు గోనెల సమ్మయ్య, కొలిపాక రామస్వామి, చల్లూరుకు చెందిన తాండ్ర శంకర్ ఎంపికయ్యారు. కళారంగంలో వీరి కృషిని గుర్తించి అవార్డుకు ఎంపిక చేసినట్లు వ్యవస్థాపకులు రాజబాబు, నాగరాజు తెలిపారు.

పట్టాలిచ్చారు.. పర్మిషన్ ఇవ్వరా?


మల్కాపూర్‌లోని నివేశన స్థలాల వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్‌లోని జర్నలిస్టులకు ప్రభుత్వం మంజూరు చేసిన నివేశన స్థలాల ప్రతిష్టంభనను తొలగించాలని డిమాండ్ చేస్తూ గురువారం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు నిరసన చేపట్టారు. కొత్తపల్లి మండలం మల్కాపూర్, చింతకుంటల్లో కేటాయించిన నివేశన స్థలాల వద్ద నల్లబ్యాడ్జీలతో ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ.. పట్టాలపై నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించాలని..జిల్లా ఇన్‌చార్జి మంత్రి, మంత్రులు జోక్యం చేసుకొని ఎన్‌ఓసీ ఇప్పించాలని కోరుతూ నినదించారు. అనంతరం మల్కాపూర్ నుంచి చింతకుంట వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. గతేడాది అక్టోబర్ 10వ తేదీన అప్పటి ప్రభుత్వం అర్హులైన జర్నలిస్టులు 118 మందికి చింతకుంట, మల్కాపూర్ ప్రాంతాల్లో నివేశన స్థలాల పట్టాలను మంజూరు చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు ఎన్‌వోసీ ఇవ్వకపోవడం, ఇల్లు నిర్మించుకునేందుకు అనుమతి మంజూరు చేయకపోవడంతో జర్నలిస్టులు ఆందోళన చెందుతున్నారన్నారు. 25 ఏళ్లుగా ఎదురుచూస్తున్న కల నెరవేరిందని సంబరపడిన జర్నలిస్టులకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నాన్చివేత ధోరణి మూలంగా జర్నలిస్టు కుటుంబాల్లో ఆందోళన నెలకొందని తెలిపారు. ఇచ్చిన పట్టాలకు, ఎన్‌వోసీ, ఇండ్లు నిర్మించుకునేందుకు తగిన అనుమతులు ఇచ్చేలా జిల్లా మంత్రులు, జిల్లా అధికార యంత్రాంగం చొరవ తీసుకోవాలని కోరారు. ఉద్యమాన్ని ఉధృతం చేయకముందే ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన ర్యాలీలో ప్రింట్, ఎలక్ట్రానిక్, ఫొటో, వీడియో జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టుకు అవార్డులు


కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి నుంచి అవార్డు అందుకుంటున్న ఈడీ కేదార్ రంజన్ పాండు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టుకు ప్రతిష్టాత్మకమైన ఎకనామిక్స్ టైమ్స్ ఎనర్జీ లీడర్ షిప్-2024లో మూడు విభాగాల్లో అవార్డులు సాధించింది. బుధవారం రాత్రి న్యూఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో ఇంధన సంరక్షణ-పరిశ్రమలు, ఎనర్జీ కంపెనీ అవార్డు, పునరుత్పాదక, ఎనర్జీ కంపెనీ అవార్డ్, పవర్ విభాగాల్లో మూడు అవార్డులను కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ, వినియోగదారుల వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి చేతుల మీదుగా ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు అందుకున్నారు. అవార్డులు రావడం పట్ల ఎన్టీపీసీ ఎన్సీసీ సభ్యుడు బాబర్ సలీంపాషా, ప్రాజెక్టు ఉద్యోగ గుర్తింపు సంఘం (ఐఎన్టీయూసీ-ఎన్ఎంయూ) వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల కృష్ణయ్య, ప్రధానకార్యదర్శి ఆరెపల్లి రాజేశ్వర్‌లు అభినందనలు తెలియజేశారు.

పారిశుధ్య కార్మికుని ఆత్మహత్యాయత్నం

- సిమ్స్ మెడికల్ కాలేజీలోనే విషం తాగిన వైనం
- రెండు నెలలుగా విధులకు తీసుకోవడం లేదని బాధితుడి ఆవేదన


చికిత్స పొందుతున్న మసూద్

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్) మెడికల్ కాలేజీలో గురువారం షేక్ మసూద్ అనే కాంట్రాక్టు కార్మికుడు విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. బాధితుడు తెలిపిన వివరాలు. స్థానిక అశోక్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ షేక్ మసూద్ రెండేళ్ల క్రితం సిమ్స్ మెడికల్ కాలేజీలో కాంట్రాక్టు పద్ధతిలో చేరాడు. తొలుత సెక్యూరిటీ గార్డుగా పనిలోకి తీసుకున్న కాంట్రాక్టర్ 15 రోజులు సెక్యూరిటీగార్డుగా పనిచేయించుకున్నారని, తర్వాత అనాటమీ విభాగంలో ఏడు నెలలపాటు శవాలను భద్రపరిచే పనులు చేయించారని తెలిపాడు. ప్రస్తుతం శానిటేషన్ విభాగంలోకి తీసుకొని స్వీపర్‌గా పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆస్పత్రిలో పనిచేసే ఇద్దరు సిబ్బందికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన సంఘటనలో తనపై పోలీసులకు ఫిర్యాదు చేశారని వెల్లడించాడు. దీంతో రెండు నెలలుగా విధులకు తీసుకోకుండా కాంట్రాక్టరు పక్కకు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ కేసు విషయంలో రాజీకి వస్తున్నామని కాంట్రాక్టరుకు చెప్పినా.. విధుల్లోకి తీసుకోకుండా మానసింగా వేధిస్తున్నారన్నాడు. కాంట్రాక్టర్‌ను వివరణ కోరగా.. మసూద్‌పై ఠాణాలో ఎఫ్ఐఆర్ నమోదవడంతో విధులకు తీసుకోలేదని తెలిపారు. రాజీ కుదుర్చుకుంటున్నామని మసూద్ చెప్పాడని, దీంతో రాజీకుదిరిన తర్వాత తీసుకుంటామని మసూద్‌కు చెప్పినట్లు కాంట్రాక్టర్ పేర్కొన్నారు. కాగా, ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన బాధితున్ని జీజీహెచ్‌లో చేర్పించిన సమయంలో, డ్యూటీలో ఉన్న కొందరు డాక్టర్లు వెంటనే స్పందించకుండా జాప్యం చేసిన తీరుపై, డాక్టర్లను కొందరు మీడియా ప్రతినిధులు ప్రశ్నిస్తే, మీరే ట్రీట్మెంట్ చేసుకోండి... అంటూ దురుసుగా సమాధానం ఇచ్చారు. ఈ విషయంపై ఆర్ఎంఓ డాక్టర్ చంద్రశేఖర్ స్పందించి వివరాలు సేకరించారు.

తప్పుడు కేసు పెట్టారనే ఆవేదనతో..

- సింగరేణి కార్మికుడు ఆత్మహత్యాయత్నం

గోదావరిఖని: తనపై తప్పుడు కేసు పెట్టారనే ఆవేదనతో సింగరేణి కార్మికుడు గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గాంధీనగర్‌లో నివాసముంటూ జీడీకే-11 గనిలో పనిచేస్తున్న ఓ సింగరేణి కార్మికుడిపై ఈనెల 13న కేసు నమోదైంది. విచారణ కోసం గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు ఆధార్‌కార్డు పట్టుకుని స్టేషన్‌కు రావాలని కబురు చేశారు. దీంతో తన సొంతగ్రామమైన రాగినేడు చేరుకుని తల్లిదండ్రుల సమాధి ఎదుట హేర్ డ్రై తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. అపస్మారక స్థితిలో ఉన్న ఇతడిని గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దీనిపై వన్‌టౌన్ పోలీసులను వివరణ కోరగా తప్పుడు కేసు పెట్టారనే ఆవేదనతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు వెల్లడించారు.

అన్నదాత ఆశలకు ‘మద్దతు’

- ధాన్యానికి మద్దతు ధర పెంపు
- పత్తికి రూ.500 పెంపు .. అపరాలకు గిట్టుబాటు ధర
- రైతులకు ప్రయోజనం రూ.120 కోట్లపైనే
- అమల్లోకి వచ్చిన మద్దతు ధరలు



కరీంనగర్ అర్బన్: అన్నదాతల ఆశలకు జీవం పోస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. వివిధ పంటలకు మద్దతు ధర పెంచుతూ కర్షకుల కళ్లలో ఆనందం నింపింది. అపరాల సాగుకు పెద్దపీట వేసిన కేంద్రం మద్దతు ధరలు పెంచేసింది. అపరాలు సాగు చేసిన రైతులకు లాభాల పంటే పండనుంది. ధాన్యం మద్దతు ధర పెంచడంతో రైతులకు గత ఏడాది కన్నా ఈ ఏడాది సుమారు రూ.120కోట్ల మేర లబ్ధి చేకూరనుంది. పెరుగుదల రేటులోను ఈ ఏడాది పెంపు కనిపించింది. అంతకుముందు క్వింటాల్‌కు రూ.50–100 వంతునే పెంపు కనిపించేది. ప్రస్తుతం రూ.150–60లకు పైగా పెంచడం కాస్త సంతోషకరమే.

అపరాల రైతుల్లో ఆనందం

గతంలో పప్పుల సంవత్సరంగా ప్రకటించిన కేంద్రం ఈ సారి అపరాల ధరలపై ప్రధానంగా దృష్టి సారించింది. గతంలో కందులు, పెసలు, మినుములు, నువ్వులు, వేరుశనగ, శనగలు, అవాలు పంటలకు తక్కువ ధర పలికేది. జిల్లాలో వరి సాగు పెరగగా మొక్కజొన్న, కందులు, పెసలు, మినుములు, వేరుశనగ, శనగలు సాగుచేసే వారి సంఖ్య తగ్గింది. గతంలో సుమారు 15వేల హెక్టార్లలో పంటలను సాగు చేసేవారు క్రమేణా 3వేల హెక్టార్ల లోపే సాగు చేయడం గమనార్హం. పప్పులు సాగు చేయడం .. మార్కెటింగ్ సౌకర్యం అంతంతమాత్రమే కాగా మద్దతు ధర దక్కిన దాఖలాలు తక్కువే. పంట అయిపోయాకా వ్యాపారులే లాభపడటం ఏటా జరుగుతోంది. కందులకు క్వింటాల్‌కు రూ.7,550, రాగులు రూ.3,846, జొన్నలు రూ.3,180, వేరుశనగ రూ.రూ.6,783, నువ్వులు రూ.9,267గా ధరలను నిర్ణయించింది. మొక్కజొన్నకు రూ.2,225, సజ్జలు రూ.రూ.2,500, సోయాబీన్ రూ.4,892, పొద్దుతిరుగుడుకు రూ.6,760గా నిర్ణయించారు.

ధాన్యం, పత్తి రైతులకు ఊరట

గత ఖరీఫ్‌లో ప్రభుత్వం నేరుగా రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో మద్దతు ధర బాగానే లభించింది. ఈ ఏడాదిలో వందకు పైగా పెంచడంతో కచ్చితంగా దాన్ని దృష్టిలో ఉంచుకునే ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వ్యాపారులకు ఎదురుకానుంది. జిల్లాలో సాధారణ విస్తీర్ణాన్ని పరిగణనలోకి తీసుకుంటే 2.75లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. జిల్లాలో సగటు దిగుబడి హెక్టారుకు 42.88 క్వింటాళ్లు. ప్రస్తుతం ప్రభుత్వం ఈ వానకాలంలో క్వింటాల్ ఏ గ్రేడు ధాన్యాన్ని రూ.2,320కు కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. అదే సాధారణ రకం ధాన్యాన్ని క్వింటాల్‌కు రూ.2300 చెల్లిస్తామని స్పష్టం చేసింది. పత్తికి రూ.500లు పెంచగా క్వింటాల్‌కు రూ.7521గా నిర్ణయించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలతో ఆ మేరకే ధరలు చెల్లించాల్సి ఉంటుంది.

ఖరీఫ్ సాగు గణాంకాల్లో

జిల్లాలో సాగు విస్తీర్ణం:	3,39,050 ఎకరాలు
మొత్తం రైతులు	: 1,93,205
వరి	: 2,75,448ఎకరాలు
పత్తి	: 43,878
మొక్కజొన్న	: 4,500
కందులు	: 2,500
పెసలు	: 1,000

గత, ప్రస్తుత మద్దతు ధరలిలా

పంట	2023-24	2024-25
మేలిమి ధాన్యం	2,203	2,320
కామన్ ధాన్యం	2,183	2,300
మొక్కజొన్న	2,090	2,225
సోయాబీన్	4,600	4,892
పత్తి(లాంగ్‌స్టెపుల్)	7,020	7,521
జొన్నలు(హైబ్రిడ్)	3,180	3,300
నువ్వులు	8,635	9,267
పొద్దుతిరుగుడు	6,760	6,900
కందులు	7,000	7,550
వేరుశనగ	6,377	6,783
మినుములు	7,000	7,400
పెసలు	8,300	8,682